నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | HYDERABAD

జూపార్కులో ఎంట్రీ ఫీజు 100

చాంద్రాయణ గుట్ట ఫిబ్రవరి 26: నెహ్రూ జూపార్కులో మార్చి 1 నుంచి ఎంట్రీ టికెట్ ధరలు పెరగనున్నాయి. పెద్దలకు 100 రూపాయలు, పిల్లలకు 50 రూపాయలు ఫీజు వసూలు చేయనున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ పార్కులు, పార్కుల అథారిటీ 13వ జనరల్ బాడీ సమావేశంలో ఈ ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్టు జూపార్కు అధికారులు తెలిపారు. సినిమా షూటింగ్‌కు సంబంధించిన కెమెరాలకు 10 వేల రూపాయలు ఫీజు తీసుకోనున్నారు. ప్రొఫెషనల్ వీడియో కెమెరాకు 2500 రూపాయలను ఫీజుగా తీసుకుంటారు. 14 సీటర్ల బ్యాటరీ వాహనాన్ని సందర్శకులకు మార్చి 1 నుంచి అందుబాటులోకి తే నున్నారు. దీనికి గంటకు 4000 రూపాయలను ఫీజు వసూలు చేస్తారు. 11 సీట్ల బ్యాటరీ వాహనానికి 3 వేల రూపాయలను తీసుకుంటారు.

విద్యుత్ సిబ్బందికి జూన్ వరకు సెలవుల్లేవ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): వచ్చే వేసవిలో దాదాపు 5వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కావొచ్చని, వినియోగం 1.10 కోట్ల యూనిట్లకు చేరుకోవచ్చని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. వేసవిలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అనుగుణంగా జూన్ వరకు విద్యుత్ ఉద్యోగులు, అధికారులు ఎవరూ సెలవులు పెట్టొద్దని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. గ్రేటర్ పరిధిలో 450 విద్యుత్ సబ్‌స్టేషన్లను సిద్ధం చేశామని, అధిక లోడ్‌కు చేరువలో ఉన్న దగ్గర 152 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, 5042 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అధికలోడ్ ఉన్న 33కేవీ 152 ఫీడర్లను, 11కేవీకి చెందిన 842 ఫీడర్లను విభజించి భవిష్యత్‌లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గ్రేటర్ పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లను ముందస్తుగా మరమ్మత్తులు చేశామని, డిమాండ్‌కు తగినట్లుగా అవసరమైన చోట ఫీడర్ల ఏర్పాటు, అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అధికలోడ్ ఉన్న ఫీడర్లపై మరింత భారంపడి సరఫరాలో అంతరాయం వచ్చే అవకాశం ఉన్న వాటిని గుర్తించి 842 అదనంగా ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు ముషారఫ్ పేర్కొన్నారు.

గ్రేటర్ @32.2డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) తూర్పు దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.2డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 20.4డిగ్రీలు, గాలిలో తేమ 51శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌పై..

నగరంలో సర్వే

నగర పరిశుభ్రతపై సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న బల్దియా

వచ్చే నెలలో నగరానికి రానున్న కేంద్ర బృందం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే మొదలైంది. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కీలక నగరాలకు ర్యాంకులను ప్రకటిస్తూ వస్తున్నది. 2015 నుంచి 2023 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో హైదరాబాద్ మెరుగైన ర్యాంకింగ్ సాధించింది. గతేడాది సిటీ 9వర్యాంకు, భారతదేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ పొందిన చెత్త రహిత నగరంగా హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై సర్వే ప్రారంభించింది. ఇప్పటి వరకు 2వేల మంది పౌరుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. నగర పౌరులకు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛతపై అభిప్రాయాలను తీసుకునేందుకు 10 ప్రశ్నలతో కూడిన ఫీడ్ బ్యాక్‌ను తీసుకుంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా సీటిజన్ ఫీడ్ బ్యాక్ లింకును పంపించి, క్యూఆర్ కోడ్, ఆ తర్వాత సంబంధిత పౌరులకు ప్రశ్నలు వేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే నెలలో కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటించనున్నది. ఏప్రిల్‌లో ర్యాంకుల జాబితాను కేంద్రం ప్రకటించనుంది.

ఎల్బీ నగర్ నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ లోని వెంకటేశ్వర హాస్పిటల్ పక్క వీధి నుంచి, వంగ శంకరమ్మ గార్డెన్ వరకు నిర్మించాల్సిన నాలా నిర్మాణ పనులు పద్మనగర్ కాలనీ వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి పనులు నిలిచి పోయాయి. నాలా పనులు పూర్తి అయితే నీటి ముంపు నుండి గట్టెక్కుతారు. కానీ పనులు ఆగిపోవటం తో రాబోయే వర్షాకాలం కూడా ఇబ్బందులు తప్పేలా లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14నెలలుగా.. అతీగతీ లేదు

మూలకు పడిన ఎస్ఎన్‌డీపీ.. నత్తకు నడకలు నేర్పుతున్న పనులు

కేసీఆర్ హయాంలో 29 చోట్ల పనులు పూర్తి

4 లక్షల కుటుంబాలకు తప్పిన వరద ముంపు

పనులు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు

మొదటి దశే పూర్తి కాని వైనం..రెండో దశ దేవుడెరుగు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహానగరంలో అనేక ప్రాంతాలను వరద ముంపు నుంచి తప్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రారంభించిన నాలా అభివృద్ధి పనుల (ఎస్ఎన్‌డీపీ) పై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. గడిచిన 14 నెలలుగా పురోగతిలో ఉన్న ఎస్ఎన్‌డీపీ మొదటి దశ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యపు ధోరణిని అవలంబిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా 40 ప్రాంతాల్లో 29 చోట్ల పనులను పూర్తి చేసి దాదాపు 175 కాలనీలకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపింది. 43 కిలోమీటర్ల పనుల పూర్తితో దాదాపు 4 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. కానీ ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు 11 చోట్ల పురోగతి పనులను పూర్తి చేయలేక చేతులేత్తేసింది. ఫలితంగా నేటికీ ఎస్ఎన్‌డీపీ పనులు మూడు అడుగులు ముందుకు-ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. చేసిన పనులకు జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించడం లేదని , పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేపడతామంటూ కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం పనులను చకచకా పూర్తి చేసేందుకు అనుకూల సమయం...ఈ వేసవిలోగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తున్నది.

తొలివిడతలో 58 చోట్ల..

2020 అక్టోబరు మాసంలో పెద్ద ఎత్తున వరదలు సంభవించిన తర్వాత వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే నగరాన్ని శాశ్వతంగా వరద ముంపు నుంచి తప్పించేందుకు ఎస్ఎన్‌డీపీ తొలి తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులకు చేపట్టింది. పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.531కోట్లతో 29 ప్రాంతాలలో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పనులను పట్టించుకోవడమే మానేసింది. క్షేత్రస్థాయిలో నత్తనడకన సాగుతున్న పనులు సర్కారు అవలంబిస్తున్న తీవ్ర జాప్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా చోట్ల గోడలు, స్లాబుల నిర్మాణ పనులు మరీ నెమ్మదిగా జరుగుతున్నాయి. ఫలితంగా రూ.394.65 కోట్లతో 11 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా వచ్చే వర్షాకాలం నాటికల్లా ఈ పెండింగ్ పనులు పూర్తి కాకపోతే సరూర్‌నగర్, నాగోల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. కాగా ఎస్ఎన్‌డీపీ రెండవ దశలో రూ.667.28కోట్లతో 40 చోట్ల పనులకు శ్రీకారం చుట్టగా.. పనులు అంగుళం కూడా ముందుకు సాగకపోవడం గమనార్హం.

ఎస్ఆర్‌డీపీ రెండవ దశ పనుల్లోనూ జాప్యమే?

పనుల పురోగతి	పనుల సంఖ్య	వ్యయం	పొడవు (కి.మీ)
పురోగతిలో ఉన్నవి	4	13.9	2.070
ప్రారంభ దశలో	15	184.59	15.953
టెండర్ దశలో	11	189.58	21.291
డీపీఆర్ దశలో	4	140.44	8.792
	34	528.51	48.106

ఎస్ఎన్‌డీపీ ఫేజ్-1 పనులు

పరిధి	పనుల సంఖ్య	కిలోమీటర్లు	వ్యయం	పురోగతి
జీహెచ్ఎంసీ	40	50.7	రూ.782.25	29 చోట్ల పూర్తి, ఆరు ప్రాంతాల్లో పురోగతి, ఐదు స్థానంలో నిలిచిన పనులు
జీహెచ్ఎంసీ అవతల				
యుఎల్‌బిలు	23	29.35	రూ.369.15	15 చోట్ల పూర్తి, 8 ప్రాంతాల్లో నిలిపివేశారు.
	63	80.05	రూ. 1151.4 కోట్లు	

- కాగా చార్మినార్ జోన్‌లో ఆరు చోట్ల పనులకు గానూ రూ.138.77కోట్ల జరుగుతుండగా.. 9.29 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం నత్త నడకన పనులు జరుగుతున్నాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 14 నెలలుగా రెండవ దశ పనులకు శ్రీకారం చుట్టగా.. టెండర్ల దశలోనే కాలయాపన చేస్తున్నది. పూర్తి స్థాయిలో పనులను పట్టాలెక్కించకపోవడం గమనార్హం.

ఈశ్వరా.. దయ చూపవయా!

1500 ఏండ్లకు పైగా చరిత్ర కలిగిన కీసరగుట్ట రామలింగేశ్వరాలయం మహాశివరాత్రి పర్వదినాన భక్తకోటి జనంతో పరవశించి పోయింది. బుధవారం తెల్లవారుజామునే భక్తులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేకాలను నిర్వహించుకున్నారు. ఆలయ గర్భ గుడిలో ఉన్న మహాశివలింగంతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇతర శివ లింగాలకు కూడా పూజలు నిర్వహించారు.

స్వామి వారి సేవలో

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మాజీ ఎంపీ సంతోష్ కుమార్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు కీసరగుట్ట రామలింగేశ్వరాలయంలో తెల్లవారుజామున అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ చైర్మన్..శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంతోష్‌కుమార్..కీసర గుట్ట మీద మొక్కలు నాటారు.

లైఫ్ టాక్స్ చెల్లించకుండానే.. చక్కర్లు

నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలు

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని

పన్ను కట్టకుండానే నగరంలోకి ప్రవేశం

ఇటీవల తనిఖీల్లో 60 వాహనాలు సీజ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలపై ఆర్టీఏ అధికారులు దృష్టి సారించారు. వాహన పన్నులు ఎగవేసి ఇష్టానుసారంగా ఇక్కడ తిష్టవేసిన వాహనాలు వేలల్లో ఉన్నాయనే ఫిర్యాదులు అందడంతో రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలకు సిద్ధమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌ల్లో ఇతర రాష్ట్రాల వాహనాలు అత్యధికంగా సంచరిస్తున్నాయి. అధికారులు జరిపిన తనిఖీల్లో 60కి పైగా వాహనాలు ఆర్టీఏ అధికారులకు పట్టుబడ్డాయి. దీంతో ప్రత్యేక డ్రైవ్ చేయాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో బృందాలను ఏర్పాటు చేశారు. నగరంలోని కొన్ని కంపెనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు కీలకంగా ఉండటంతో వాళ్లంతా తమ రాష్ట్రాలకు చెందిన వాహనాలను ఇక్కడ పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై తెలంగాణ ఫోర్ వీలర్ అసోసియేషన్ రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసింది.

ఇవీ నిబంధనలు

చాలా వరకు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను నగరంలో తిప్పుతున్నారు. సాధారణంగా రూ. 5 లక్షల నుంచి 10 లక్షల మధ్య విలువజేసే ఫోర్ వీలర్ వాహనం అయితే దాని ఖరీదుపై 14 శాతం లైఫ్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అదే ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయి టాక్స్ చెల్లించి.. రెండేండ్లు గడిస్తే.. ఆ వాహనం తెలంగాణలో నడపాలంటే ఖచ్చితంగా ఇక్కడి నిబంధనల ప్రకారం టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఆ రెండేండ్ల పన్నుని మినహాయించి మిగత పన్నును వసూలు చేస్తారు. సదరు యజమాని అక్కడ చెల్లించిన సొమ్మును అక్కడి ఆర్టీఏకు దరఖాస్తు పెట్టుకుని తిరిగి తన ఖాతాలో జమ చేసుకోవచ్చు. ఉదాహరణకు ముంబైలో రూ. 9 కోట్ల విలువజేసే కారును కొనుగోలు చేస్తే.. ఆ వాహనాన్ని తెలంగాణలో నడపాలనుకుంటే 14 శాతం టాక్స్ అనగా, సుమారు కోటి 26 లక్షలు పన్ను చెల్లించాలి. ఒకవేళ చెల్లించకుండా కాలయాపన చేస్తే ఇన్‌వాయిస్ ఆధారంగా మళ్లీ లైఫ్ టాక్స్‌పై నెలకు 1 లేదా 2 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. వాహన యజమాని నేరుగా పన్ను చెల్లిస్తే కారు ఖరీదు ఆధారంగా 1 శాతం పెనాల్టీ లేదా అధికారుల తనిఖీల్లో పట్టుబడితే చెక్ రిపోర్ట్ ఆధారంగా 2 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించిన అనంతరం జరిగే ప్రక్రియతో ఇక్కడి నెంబర్‌ప్లేట్ జారీ అవుతుంది. నిర్లక్ష్యం చేస్తే ఆర్టీఏ అధికారులు వాహనాలను సీజ్ చేస్తారు. అంతే కాదు అనుమతి లేకుండా వాహనాలను నడిపి ఏదైన రోడ్డు ప్రమాదానికి పాల్పడితే అలాంటి సంఘటనల్లో మరింత కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

పన్ను ఇలా..!

వాహన గడువు	రూ.5లక్షల లోపు	రూ.5-10లక్షలు	రూ.10-20లక్షలు	రూ.20లక్షలపై
కొత్త వాహనం	13	14	17	18
2 ఏండ్ల లోపు	12	13	16	17
2-3 ఏండ్ల లోపు	11.5	12.5	15.5	16.5
3-4 ఏండ్లు	11	12	15	16
4-5 ఏండ్ల లోపు	10.5	11.5	14.5	15.5

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

-సి.రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్.

ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నాం. పన్ను ఎగవేసి నిబంధనలు అతిక్రమించిన వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాలు సీజ్ చేస్తాం. ఆర్టీఏ నిబంధనలు అందరూ పాటించాలి. నగర రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది.

పుట్టిన పసికందులను

రాష్ట్రాలు దాటిస్తున్నదెవరు?

పసిపిల్లల విక్రయ ముఠాల సూత్రధారులెక్కడ..?

ఉత్తర భారత్ నుంచి వందలాది పసిపిల్లల అక్రమ రవాణా

గత ఏడాది 60 మంది పిల్లలను విక్రయించిన ముఠా

తాజాగా బయటపడ్డ మరో ముఠా భాగోతం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): పసిపిల్లల విక్రయాల కేసులో ఇతర రాష్ట్రాలలో కీలక నిందితుల మూలాలు తెలియకుండా పోవడం ఓ మిస్టరీలా మారింది. పసిపిల్లలను విక్రయించడం..ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం.. ఇలా చేస్తూ పోలీసుల నిఘానుంచి విక్రయ ముఠాలు తప్పించుకుంటున్నాయి. అచ్చం సినిమా కథలా పసిపిల్లల విక్రయ ముఠా.. పుట్టిన పసి కందులను వేల కిలోమీటర్లు అక్రమంగా రవాణా చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ ముఠాలు విక్రయిస్తున్నాయి. గత ఏడాది మే నెలలో రాచకొండలోని మేడిపల్లి పోలీసులు ఇలాంటి ముఠాలో 11 మందిని అరెస్ట్ చేసి, 14 మంది పసిపిల్లలను కాపాడారు. ఈ ముఠాకు ఢిల్లీ, మహారాష్ట్రలతో సంబంధముందని తేలింది. తాజాగా చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో పిల్లల విక్రయ ముఠాను అరెస్ట్ చేశారు, పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను సైతం పోలీసులు ఈ సారి అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు గుజరాత్‌తో సంబంధాలున్నట్లు వెల్లడయ్యింది. ఇతర రాష్ట్రాలలో అల్లుకుపోయిన ఈ ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడంలో అటూ ఆ రాష్ట్రాలకు చెందిన పోలీసులు, ఇటూ తెలంగాణ పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు పిల్లలను అపహరించుకొని తీసుకొస్తున్నారా? పుట్టిన బిడ్డలను వారి తల్లిదండ్రులే స్వయంగా డబ్బుకు ఆశపడి విక్రయిస్తున్నారా? అనే విషయంలో స్పష్టత లేదు. పిల్లలు లేని వారు అక్రమ పద్ధతిలో పిల్లలను కొనుగోలు చేస్తుండడం ఆందోళన కల్గిస్తున్న అంశం. ఈ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించలేకపోవడంతో ..కాపాడిన పిల్లలను వారి సొంత తల్లిదండ్రుల వద్దకు చేర్చలేని పరిస్థితి నెలకొంది. అటువంటి పిల్లలు ఇంకా శిశువిహార్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు.

ఎంత మందిని విక్రయించారో..?

పిల్లలను ఎక్కడి నుంచి తెస్తున్నారనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. కేవలం తెలంగాణలోనే 8 నెలల వ్యవధిలో రెండు ముఠాలకు సంబంధించిన ఆచూకీ బయటపడింది. సోషల్‌మీడియా ద్వారా ఈ ముఠా తమ కార్యకలాపాలను సాగిస్తూ, పోలీసులకు చిక్కకుండా ఎత్తులు వేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే గుజరాత్‌కు చెందిన వందన, ఢిల్లీ, పుణేలకు చెందిన కిరణ్, ప్రీతి, కన్నయ్యల లాంటి వాళ్లు తమ నెట్‌వర్క్‌ను అన్ని రాష్ట్రాలలోను నిర్వహించే అవకాశాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సారి ఎలాగైనా ఈ నెట్‌వర్క్‌ను ఛేదించాలని ముందుకు సాగుతున్నారు. అయితే హైదరాబాద్‌లో ఈ ముఠా పట్టుబడగానే అప్పటి వరకు నిర్వహించిన నెట్‌వర్క్‌లోని సభ్యులందరు అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్నాళ్లు స్తబ్ధుగా ఉంటూ తిరిగి తమ నెట్‌వర్క్‌ను యాక్టివేట్ చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా అరెస్టయిన కృష్ణవేణికి గత ఏడాది ఢిల్లీకి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. మేడిపల్లి, చైతన్యపురి పోలీస్‌స్టేషన్లలో నమోదైన పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులను ఛాలెంజ్‌గా తీసుకొని వాటి మూలాలను ఛేదించేందుకు గాలింపు ముమ్మరం చేశారు. అయితే ఈ సారైనా పోలీసులు పకడ్బందీ వ్యూహాలతో ఈ ముఠాలలోని కీలక నిందితులను పట్టుకుంటారా..అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రెండు రాష్ట్రాలలో గాలించినా..

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో పిల్లల విక్రయ ముఠాను గత ఏడాది మేలో మేడిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందులో మేడిపల్లికి చెందిన శోభ, స్వప్న, షేక్ సలీమ్‌లతో పాటు పద్మ, సరోజ, శారద, షకీలా, రాజు, ముంతాజ్ తదితరులను అరెస్ట్ చేశారు. ఈ పిల్లలు ఎక్కడక్కడ విక్రయించారనే విషయాన్ని గుర్తించి విక్రయించిన 14 మంది పిల్లలను కాపాడారు. పిల్లలను రూ.5 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసిన తల్లిదండ్రులు అప్పుడు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎదురుగా ఆందోళన సైతం చేశారు. ఇదే ముఠా ముంబాయిలోను పిల్లలను విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. ఈ ముఠాపై థానే పోలీసులు కేసు నమోదు చేశారని తేలింది. ఈ ముఠా 60 మంది వరకు పిల్లలను విక్రయించిందని పోలీసుల విచారణలో తేలింది. ఏపీ, తెలంగాణకు చెందిన ఏజెంట్ల ద్వారా పిల్లలను విక్రయించడంలో కీలకంగా వ్యవహరించిన ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణేకు చెందిన కన్నయ్యలను పట్టుకుంటే కీలక నిందితుల ఆచూకీ తెలుస్తుందని రాచకొండ పోలీసులు ప్రయత్నించారు. అయితే దళారుల ఆచూకీ తెలియకపోవడంతో మూలాల వరకు వెళ్లలేకపోయారు.